









సాగునీటిని వినియోగించుకోవాలి



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం పేర్కొన్నారు. స్థానిక మునేరు ప్రధాన కాలువ నుంచి శుక్రవారం బ్రాంచి కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ రైతులు నీటిని వృథా చేయొద్దని కోరారు. ఈ నీటిని పంటల సాగుకు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయం పండగలా మారిందని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, ఇరిగేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంచికచర్ల ఎంఈఓ-1గా రవికుమార్

కంచికచర్ల: మండల విద్యాశాఖాధికారి–1గా కొండా రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విజయవాడ వెస్ట్‌లో పని చేసి కంచికచర్లకు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయన్ను ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య ఆధ్వర్యంలో సంఘ నాయకులు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు అంజిరెడ్డి, జిల్లా కార్యదర్శి శేషం గోపాలరావు, మండల ఉపాధ్యక్షులు నంద్రు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

















క్రీడా పరికరాలు అందజేత



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పలువురు క్రికెట్ క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్న బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ క్రీడాకారులకు ఫిట్‌నెస్ ఎక్విప్‌మెంట్‌ని అందజేశారు. దాత మీసాల మనోజ్‌కుమార్ జన్మదినం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందజేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శుక్రవారం విజయవాడకు చెందిన సీహెచ్ దీపాన్విత బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రాజగోపురం ఎదుట కళావేదికపై దీపాన్విత బృందంలోని సాత్విక, ఉజ్వలసాయి, హాసిని, సింధూజ, నిందిత, జ్ఞానదీపికలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం చేయించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

శాంతియుత సమాజమే క్రీస్తు సందేశం



వీరులపాడు: శాంతియుత సమాజమే ప్రభువు ఏసుక్రీస్తు సందేశమని విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం విచారణ పరిధిలో నూతనంగా నిర్మించనున్న పరిశుద్ధ లూర్దుమాత ఆలయ పునాది రాయి ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ ఫాదర్ సాలె వినయ్‌కుమార్, ఫాదర్‌లు విలియం జయరాజు, గాబ్రియేలు, పీకె జోసఫ్ మరియదాసు, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఐటీసీ అకాడమీ సహకారంతో జరిగిన సదస్సులో మైక్రోసాఫ్ట్ అజ్యూర్ ఏఐపై ప్రొఫెసర్ రాఘవేంద్రస్వామి వివరించారు. అధ్యాపకులకు బోధన నైపుణ్యాలు వివరించారు. ఏఐని ఏవిధంగా బోధించాలి, వాటి ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, 30మంది అధ్యాకులు పాల్గొన్నారు.

28న ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 28వ తేదీ వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కార్లు, ఒక ఆటో, రెండు ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.10 వేలు, ద్విచక్రవాహనాలకు రూ.5 వేలు చొప్పున ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రిఫండబుల్) కట్టి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలకు ఎస్‌ఈబీ భవానీపురం స్టేషన్ ఎస్ఐ పి.వంశీరామ్ 9182979919, కానిస్టేబుల్ సీహెచ్ సుబ్రహ్మణ్యం 8074269210 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

24 నుంచి ఇంటర్ తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాలలో 2023 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక శిక్షణనిచ్చి వారు పరీక్షలకు హాజరుకావడానికి సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా అందిస్తామని, ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. తరగతులను 24వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 8919316615కు సంప్రదించాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండేషన్ సహకారంతో దుర్గాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





















నేడు పలు గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలు

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట-1, వేదాద్రిలో శనివారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం తెలిపారు. రెండు బృందాలుగా అధికారులు క్యాంపు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పెనుగంచిప్రోలు: మండలంలోని కొణకంచి గ్రామ సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నందిగామ: పట్టణ పరిధిలోని 9వ సచివాలయం వద్ద శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెద్దవరం గ్రామ సచివాలయం వద్ద సురక్ష జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

కంచికచర్ల: వేములపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష గ్రామసభ శనివారం జరుగనుందని ఎంపీడీఓ బాలశంకరరావు శుక్రవారం తెలిపారు.

మెప్మా కార్యాలయంలో ఆడిట్



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) కార్యాలయంలో శుక్రవారం నుంచి ఆడిట్ నిర్వహిస్తున్నట్లు చార్టెడ్ ఎకౌంటెంట్ వీజీ హరీష్ బృందం తెలియజేసింది. జగ్గయ్యపేటలోని మొత్తం 1,156 స్వయం సహాయక గ్రూపుల్లో శుక్రవారం 200 గ్రూపులకు ఆడిట్ చేసినట్లు వారు తెలిపారు. ఈ నెల 28 వ తేదీ వరకు ఆడిట్ కొనసాగుతుందని ఆ బృందం సభ్యులు తెలిపారు.

బీఎల్వోల సమాచారమే కీలకం



బీఎల్వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో



కొణకంచి సర్వేలో రెవెన్యూ అధికారులు

నందిగామ: బూత్ లెవెల్‌లో ఓటరు వెరిఫికేషన్ చేసే ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. నియోజకవర్గంలో శుక్రవారం నుంచి డోర్ టు డోర్ ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. పల్లగిరి, సత్యవరంలో జరుగుతున్న వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆర్డీవో రవీంద్రరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కచ్చిత ఓటర్ల జాబితా రూపొందించడంలో బూత్ లెవల్ అధికారులు నమోదు చేసే సమాచారమే కీలకమని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ నరసింహారావు, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే

పెనుగంచిప్రోలు: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా శుక్రవారం బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సర్వే జరగనుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేస్తారన్నారు. సర్వేలో ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓటర్ల గుర్తించటంతో పాటు మరణించిన వారి ఓట్ల తొలగింపు, డోర్ నంబర్లు లేకుండా ఉన్నా, ఒకే డోరు నెంబర్‌లో పదుల సంఖ్యలో ఓటర్లపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారన్నారు. ఇంకా పలు అంశాలపై ఈ సర్వే జరుగుతుందని తెలిపారు. మొత్తం మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల పరిధిలో సర్వే పక్కాగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జనార్ధనరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై ప్రజా సంఘాల నిరసన

జగ్గయ్యపేట అర్బన్: మణిపూర్‌లో గిరిజన మహిళలను వివస్త్ర చేసి లైంగికదాడికి పాల్పడిన ఘటనలపై పట్టణంలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం, సీఐటీయూ తదితర ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలో, మణిపూర్‌లో బీజేపీ అధికారంలో ఉందని, కొంత కాలంగా మణిపూర్‌లో మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నా కేంద్రానికి, ప్రధాని మోదీకి పట్టనట్లు ఉందన్నారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలు అడ్డుకున్న మహిళ తండ్రి, అన్నను సైతం చంపడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు దేశవ్యాప్తంగా సంఘీభావం తెలపాలని కోరారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్.నాగమణి, ప్రజా సంఘాల నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, ఎస్.రామనాథం, రావెళ్ల శేషు, రాజు, వెంకట్, రాజమణి, న్యాయవాది దాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నందిగామ: మణిపూర్‌లో ముగ్గురు మహిళలను వివస్త్రలుగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను వ్యతిరేకిస్తూ శుక్రవారం సాయంత్రం నందిగామ గాంధీ సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. పలువురు మాట్లాడుతూ మణిపూర్ ఘటన బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఘటనకు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సనుమోలు సైదులు, సయ్యద్ ఖాసిం, షేక్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

విద్యార్థినికి ఆర్థిక సాయం

సత్యనారాయణ(విజయవాడసెంట్రల్): విద్యార్థుల భవిష్యత్తుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణ తెలిపారు. సత్యనారాయణపురంలోని శృంగేరిపీఠంలో బలరామకృష్ణమూర్తి దంపతుల చేతుల మీదుగా ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినికి శుక్రవారం రూ. 40,647 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినికి చేయూత అందించే ఉద్దేశంతో అమెరికాలో నివాసముంటున్న డాక్టర్ కాట్రపాటి సుబ్బరాయశర్మ ఆర్థిక సాయంతో చెక్కును అందజేసినట్లు తెలిపారు. పేదరికంతో ఉన్నత చదువులు చదవలేని విద్యార్థులకు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శృంగేరి శారదాపీఠం ధర్మాధికారి బీవీ చలపతిరావు, బ్రాహ్మణ బిజినెస్ నెట్‌వర్క్ ప్రతినిధి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బలరామకృష్ణ

విధుల్లోకి తీసుకోవాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అకారణంగా తొలగించిన రైల్వేస్టేషన్‌లోని పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లో తీసుకోవాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్యదర్శి ఈవీ నారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ శుక్రవారం కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రక్షక్ కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంగా కార్మికులను తొలగించి వారిని రోడ్డు పాలు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ తన లాభాల కోసం కార్మికుల కడుపులు కొట్టే పద్ధతి మార్చుకోవాలని కోరారు. రైల్వే అధికారులు కూడా ఈ సమస్యపై స్పందించి కార్మికులందరినీ పనిలోకి పెట్టించే చర్యలు చేపట్టి వారికి న్యాయం చేయాలని విన్నవించారు. పనులు కోల్పోయి పోరాటం చేస్తున్న కార్మికులకు పని చేస్తున్నవారు కూడా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పోరాటంలో ఉన్న కార్మికులకు అన్ని సంఘాల మద్దతును కూడగట్టి భవిష్యత్తులో తమ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు కె. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బీ వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి సాయిపురంకాలనీలోని రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదుపై గ్రామ వీఏఏ, వీఆర్‌ఓ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఓలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ పంటకు సంబంధించి ఈ-క్రాప్ చేయించుకునేందుకు అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. అగ్రికల్చర్ ఆఫీసర్ బీ రంగనాథ్ బాబు మాట్లాడుతూ కౌలు రైతులందరికీ ఈ నెలాఖరుకు నూరు శాతం కౌలు కార్డులు ఇవ్వాలని వీఆర్వోలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాహ్నవి, ఈఓలు ఆర్ సురేష్, వీ విజయకుమార్, ఏఎస్‌ఓ విజయలక్ష్మి, విజయవాడ అర్బన్ ఏఓ కె.రఘురామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ వెంకటేశ్వరరావు

మల్లేశ్వరస్వామి ఆలయ పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మల్లేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాలతో పాటు వైదిక కమిటీ సభ్యులు మల్లేశ్వరాలయానికి చేరుకుని ఆలయ శిఖరం పనుల గురించి కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రానున్న దసరా, కార్తీక మాసం నాటికి స్వామి వారి దర్శనం కలిగేలా ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఆలయ శిఖర పనులు పూర్తి కానున్న నేపథ్యంలో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసే విగ్రహాల తయారీని ఆదివారం వెళ్లి పరిశీలించాలని నిర్ణయించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు మారుతీ యజ్ఞనారాయణ శర్మ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. తిరుపతి సమీపంలోని శిల్పశాలను ఆదివారం దుర్గగుడి అధికారులు సందర్శించాలని భావిస్తున్నారు. ఇప్పటికే దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తిరుమలలో ఉండగా, ఆదివారం ఈవో భ్రమరాంబ, ఈఈ కోటేశ్వరరావు, ఎల్. రమాలతో పాటు కాంట్రాక్టర్, ఇతర అధికారులు అక్కడకు చేరుకుని శిల్పాలను పరిశీలిస్తారు.



ఆలయ పనులు పరిశీలిస్తున్న ఈవో భ్రమరాంబ, ఇంజనీరింగ్ అధికారులు

మధురంగా శాస్త్రీయ సంగీత కచేరీలు

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ షష్టి పూర్తి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే సంగీత మహోత్సవాలు లబ్బీపేట శారద చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు, వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, స్వాతి తిరునాళ్, అన్నమయ్య, రామదాసు, రచించి స్వరపరచిన కీర్తనలు ఆలపించారు. టి.రుక్మిణీ కృష్ణ తిరుచ్చినాపల్లి, ఎస్పీ రాగమయూరి అబుదాబీ, లోళ్ళ జయరాం, శివలెంక విశ్వనాథ్, వలివేటి నీరజ, ఎం.హరిప్రియ, లంక తేజస్వి సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. కార్యక్రమాలను ప్రారంభించిన వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ గురు శిష్యుల సంబంధం దైవ సంబంధమైనదన్నారు. నగరం సకళ కళానిలయమని, ఎందరో సంగీత విద్వాంసులకు వేదికైందని తెలిపారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ సంగీత సేవలను వివరించారు. వేమూరి విశ్వనాథ్, భమిడిపాటి శ్రీలలిత నిర్వహించారు.



గానం చేస్తున్న వలివేటి నీరజ

అన్న ప్రసాదాన్ని వృథా చేయకండి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో రాత్రి వేళ నిద్ర చేసే భక్తులకు పంపిణీ చేసే అన్న ప్రసాదాన్ని వృథా చేయరాదని చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. మహా మండపం గ్రౌండ్ ఫ్లోర్‌లో రాత్రి జరిగే అన్న ప్రసాద వితరణను దుర్గగుడి చైర్మన్ శుక్రవారం పరిశీలించారు. అన్న ప్రసాద నాణ్యతను పరిశీలించడంతో పాటు భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు వృథా చేయవద్దని, భక్తులందరికీ అన్న ప్రసాదం అందేలా ఆలయ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

ఎంఎస్ఎంఈ ప్రాజెక్ట్‌కు విద్యార్థిని ఎంపిక

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థిని ఓ ప్రత్యూష మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈ) ప్రాజెక్ట్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు శుక్రవారం తెలిపారు. విద్యార్థిని ప్రత్యూష ఆక్సిజన్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే అంశంపై పరిశోధించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు గాను ఎంఎస్ఎంఈ వారు రూ.15లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినిని కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, మెంటర్ డాక్టర్ కే వేణుగోపాల్, డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సత్యనారాయణ అభినందించారు.



విద్యార్థిని ప్రత్యూషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, అధ్యాపకులు

మహిళల పట్ల గౌరవంతో మెలగాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళ ప్రయాణికుల పట్ల గౌరవంగా ఉండటంతో పాటు ఆటోకు సంబంధించిన రికార్డులన్నీ ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని ఆటో యజమానులు, డ్రైవర్లతో సీఐ సుబ్రహ్మణ్యం రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో సమావేశమయ్యారు. ఆటో రికార్డులన్నీ ఫోర్స్‌లో ఉంచుకోవాలని, మైనర్లకు ఆటోలు అద్దెకు ఇవ్వడం నేరమని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్‌తో పాటు ఆటో యజమాని బాధ్యులవుతారని హెచ్చరించారు. అదే విధంగా రాత్రి వేళలో రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు వెళ్లే సమయంలో మహిళా ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని చెప్పారు. ఆటోలో ఏదైనా మర్చిపోతే పోలీస్‌స్టేషన్‌లో అందించి బాధితులకు చేరేలా చూడాలన్నారు.

డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్‌ను మెడికల్ ఫీల్డ్‌లో ఉపయోగించి మానవ శరీరంలోని నరాల పనితీరును స్పష్టంగా తెల్సుకునేందుకు ఇన్ఫ్రారెడ్ కిరణాలు ఎంతగానో దోహదం చేస్తాయని అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.ఫణి శ్రీనివాస్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ ఇన్ మెడికల్ ఫీల్డ్ అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం వైద్య రంగంలో మానవ శరీరంలోని అవయవాల పనితీరును గుర్తించడానికి ఎక్స్‌రే, ఈసీజీ, వివిధ రకాల స్కాన్‌లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. వీటి కన్నా ఇన్ఫ్రారెడ్ కిరణాలను శరీరంలోకి పంపడం ద్వారా అవయవాల పనితీరు స్పష్టంగా తెల్సుకోవడమే కాకుండా భవిష్యత్తులో శరీరంలో వచ్చే జబ్బులను కూడా గుర్తించవచ్చని వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై పరిశోధనలు జరుగుతున్నాయని, మంచి ఫలితాలే వస్తున్నాయని చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కేఎస్‌వీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లో చెప్పిన అంశాలతో పాటుగా ఇలాంటి అవగాహన సదస్సుల వల్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డీన్ రాజేష్ సి.జంపాలతో పాటుగా అధ్యాపకులు పాల్గొన్నారు.



ఫణి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

రుచికరమైన వంటల తయారీపై సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నోరూరించే రుచికరమైన వంటకాల తయారీపై శుక్రవారం శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఆశీర్వాద్ స్పైసెస్, రెడ్ ఎఫ్ఎం 93.5 ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో చెఫ్ రాణి రుచికరమైన వంట తయారు చేసే టిప్స్‌పై అవగాహన కలిగించారు. పలు వంటకాలను లైవ్‌లో తయారు చేసి చూపించారు. వాటిని టేస్ట్ ఆఫ్ బెజవాడకు చెందిన ఫుడ్ ఇన్‌ఫ్లుయన్సర్స్ దాన్య, నంద రుచి చూసి వారి ఫీడ్‌బ్యాక్ చెప్పారు. అంతేకాక రెడ్ ఎఫ్ఎం ఆర్‌జేలు విద్యార్థినులతో పలు గేమ్స్ ఆడించారు. ఆ కళాశాల డైరెక్టర్ టి. విజయలక్ష్మి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రెడ్‌ఎఫ్ఎం ఆర్‌జేలు ఆర్య, ఇస్మార్ట్ స్వీటీతో పాటు స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్‌బాషా పాల్గొన్నారు.

7న తిరుపతిలో ఓబీసీ 8వ జాతీయ మహాసభలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓబీసీ 8వ జాతీయ మహాసభలు ఆగస్టు 7న తిరుపతిలోని తారక రామ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కె.ఆల్‌మెన్ రాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆల్‌మెన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభలకు ప్రభుత్వంలోని ప్రముఖులు హాజరవుతారన్నారు. చేతి వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాటికొండ రంగబాబు మాట్లాడుతూ 'మా వృత్తి.... మా వాటా ..మేమెంతో... మాకంత' అనే నినాదంతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు దేవు రవి,రాజు, రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు చిప్పాడ చందు, కదలి ప్రసాద్, కార్పెంటర్స్ అసోసియేషన్ గన్నవరపు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఓబీసీ జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆల్‌మెన్ రాజు

రిలే దీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.నరసింహారావు, మండల గౌరవ అధ్యక్షులు సోమోజు నాగమణి, కార్యదర్శి షేక్ గౌసిమియా, తదితరులు పాల్గొన్నారు

ఆర్‌బీకేల్లో సిద్ధంగా వరి విత్తనాలు

వత్సవాయి: గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీటీ 5204 రకం సాంబమసూరి రకం విత్తనం 25 కేజీల బస్తా రూ.830కు అందిస్తున్నట్లు తెలిపారు. కావల్సిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో సచివాలయంలో సంప్రదించి వరి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

ఆటో ధ్వంసంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దాడికి పాల్పడటమే కాకుండా ఆటోను ధ్వంసం చేసిన ముగ్గురిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బ్లాక్ నెం 148కి చెందిన పట్నాల సాయికుమార్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. కాలనీలోని 5వ బ్లాక్‌లో నివాసం ఉండే సాయికుమార్ బావ ప్రసాద్ వాళ్ల తాత మరణించడంతో చూసేందుకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఆ తర్వాత ప్రసాద్‌తో పాటు శ్రీను, అఖిల్ అనే వారు సాయికుమార్ ఇంటికి వచ్చి నోటికి వచ్చినట్లు తిట్టడంతో ఎందుకు తిడుతున్నారని అడిగాడు. దీంతో సాయికుమార్ తల్లిని కూడా తిట్టడమే కాకుండా ఇంటి ముందు ఉన్న ఆటో అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.













